అసోంలో కోటి మొక్కల ఉద్యమం ఉధృతం

- 2030 నాటికి లక్ష్యం పూర్తి చేస్తాం
- తూర్పు హిమాలయాల్లో జీవవైవిధ్యమే లక్ష్యం
- గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్
- తములోపూర్‌లో పద్మశ్రీ జాదవ్‌తో కలసి మొక్కలు నాటే కార్యక్రమం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసోం రాష్ట్రంలో 2030 నాటికి కోటి మొక్కలు నాటనున్నట్టు గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ వెల్లడించారు. అసోంలోని తములోపూర్‌లో ఆదివారం గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పాయెంగ్, స్థానిక ఎమ్మెల్యే జోలెన్ దోయినరీతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ నిరుడు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే 2.5 లక్షల మొక్కలు నాటామని సంతోష్‌కుమార్ తెలిపారు. పద్మశ్రీ జాదవ్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. స్థానిక సంస్థలు, ఎన్జీవోల సహకారంతో 2030 నాటికి అసోంలో కోటి మొక్కలు నాటాలని నిర్ణయించినట్టు తెలిపారు. మజులీ ప్రాంతంలో జాదవ్ మొక్కలు నాటి అభివృద్ధి చేసిన మలైకోతాని తరహాలో మియావాకి విధానంలో చిక్కటి అడవుల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తామని, తద్వారా తూర్పు హిమాలయాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడుతామని వివరించారు. ఇందుకు నవోదయ సంస్థ సహకారం తీసుకుంటామని చెప్పారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టిన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ కృషి అభినందనీయమని పద్మశ్రీ జాదవ్ కొనియాడారు. కార్యక్రమంలో తములోపూర్ జిల్లా కలెక్టర్ బికాస్ భగవత్, ఇగ్నైటింగ్ మైండ్స్ నుంచి రీతు రాజ్ పుకాన్, నవోదయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అసోంలోని తములోపూర్‌లో పద్మశ్రీ జాదవ్ పాయెంగ్, స్థానిక ఎమ్మెల్యే జోలెన్‌తో కలిసి మొక్క నాటుతున్న మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం వాగొడ్డురామన్నపల్లి వద్ద వర్షాలకు నాలాకు గండి పడగా సొంత డబ్బుతో పూడ్చుతున్న చేస్తున్న రైతులు

శ్రమదానం చేసి.. గండిని పూడ్చేసి

- ఇల్లందకుంట మండలంలో రైతుల శ్రమదానం
- వెంకటేశ్వర నాలాకు అన్నదాతల మరమ్మతులు

ఇల్లందకుంట సెప్టెంబర్ 15: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని వాగొడ్డురామన్నపల్లి, మల్యాల, కనగర్తి, లక్ష్మీజీపల్లి గ్రామాల రైతులకు సాగు నీరందించే వెంకటేశ్వర నాలాకు ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడింది. దీనికి మరమ్మతులు చేసేందుకు అధికారులెవ్వరూ ముందుకు రాకపోవడంతో రైతులే శ్రమదానం చేసి గండిని పూడ్చారు. వివరాల్లోకి వెళ్తే.. వాగొడ్డురామన్నపల్లి వద్ద గతంలో స్థానిక వాగుపై వెంకటేశ్వర నాలా నిర్మించారు. దీని కింద 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవలి వర్షాలకు నాలాకు గండి పడింది. దీంతో ఆయకట్టు కింద నీరు లేక పొలాలు ఎండిపోవడంతో రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవడంతో పంటలను బతికించుకోవడానికి మూడు గ్రామాలకు చెందిన 50 మంది రైతులు శ్రమదానం చేసి తాత్కాలికంగా గండిని పూడ్చారు. నాలా గండిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చేయాలని అయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం సూర్యనాయక్ తండాలో ఇల్లు కూలి నిరాశ్రయులైన బాలు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న తండావాసులు

ఇల్లు కూలింది.. ఊరు సాయం చేసింది!

- కట్టుబట్టలతో రోడ్డున పడ్డా కనికరించని అధికారులు
- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు

శాయంపేట, సెప్టెంబర్ 15: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాత ఇల్లు నేలమట్టమైంది. దీంతో ఆ పేద కుటుంబం కట్టుబట్టలతో వీధినపడింది. సాయం చేస్తారనుకున్న అధికారులు ఒక్కరూ దయచూపలేదు. దీంతో బాధిత కుటుంబానికి తామున్నామంటూ ఆ ఊరి ప్రజలే అండగా నిలిచారు. ఈ ఘటన ఆదివారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం సూర్యనాయక్ తండాలో జరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తండాలోని జుర్పుల బాలు పాత ఇల్లు నేలమట్టమైంది. కూతురు, కుమార్తె, భార్యతో కలిసి బాలు పాత పెంకుటింటిలో ఉంటూ రోజు కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. వానలకు తడిసిన ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు కూలడంతో ఇంట్లోని సామగ్రి, బట్టలతోపాటు ఇతర వస్తువులు పనికిరాకుండా పోయాయి. దీంతో నిలువ నీడ లేక గ్రామంలోని ఒకరి ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఉన్న ఇల్లు కూలిపోయింది.. చేతిలో చిల్లిగవ్వ లేదు.. అధికారులు సాయం చేయాలని పలుమార్లు బాలుతోపాటు గ్రామస్థులు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. అయినా ఎవరూ ఆదుకోలేదు. దీంతో తండాలోని యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ పెద్దలు మానవత్వంతో వారికి అండగా నిలిచారు. తలా కొంత వసూలు చేసి రూ.25 వేలు బాలు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ భూక్యా రమేశ్, మాజీ ఉప సర్పంచ్ వస్రం, మాజీ ఎంపీటీసీ రెడ్డినాయక్, సుమన్, రవీందర్, దేవ్‌సింగ్, సునీల్, బాష పాల్గొన్నారు.

గూడు చెదిరి.. ఆగిన గుండె

- మున్నేరు ముంచింది.. సర్కారు చేతులేత్తెసింది
- సాయం కోసం ఎదురుచూసి తీవ్ర ఆందోళన
- నష్టం భరించలేక గుండెపోటుతో కోటయ్య కన్నుమూత
- దహన సంస్కారాలకు బీఆర్ఎస్ నేతల ఆర్థిక సాయం
- ఖమ్మం జిల్లా కేంద్రంలో విషాదం

మృతుడు కోటయ్య సతీమణికి ఆర్థిక సాయం అందించి అతడి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, స్థానిక మాజీ కార్పొరేటర్ తోట రామారావు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 15: ఖమ్మం నగరంలోని 48వ డివిజన్‌కు చెందిన దోరేపల్లి కోటయ్య (70) దశాబ్దాలుగా దానవాయిగూడెం పార్కు ఏరియాలోని గణేశ్‌నగర్‌లో ఓ రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన ఆయన.. వృద్ధాప్యం కారణంగా కొన్నేండ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు ఉండగా ఓ కొడుకు మరణించాడు. కుమార్తెకు వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లిపోయింది. అవివాహితుడైన మరో కుమారుడు తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నాడు. భార్య శాంతమ్మతో కలిసి కోటయ్య రేకుల ఇంట్లో నివసిస్తున్నాడు. తనకు వచ్చే రూ.2 వేల ప్రభుత్వ ఆసరా పింఛన్‌తోనే జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 31న వచ్చిన మున్నేరు వరద వీరి ఇంటిని ముంచెత్తింది. కోటయ్య, అతటి భార్య శాంతమ్మ ఆ రాత్రి కట్టుబట్టలతో బయటికెళ్లారు. తెలిసిన వారి ఇంట్లో కొద్దిరోజులు తలదాచుకున్నారు. వరద తగ్గాక ఇంటికి రావడంతో ఇంటి గోడలన్నీ పగుళ్లతో కనిపించాయి. బాత్‌రూం కూలిపోయింది. అతడి మోపెడ్ వాహనం బురదలో కూరుకుపోయింది. నిత్యావసర సరుకులన్నీ వరదలో కొట్టుకుపోయాయి. వీరు వృద్ధాప్యంలో ఉన్నందున బంధువులు వచ్చి ఇంట్లోని బురదను శుభ్రం చేసి వెళ్లారు. సర్వస్వం కోల్పోయి తీవ్రమైన ఒత్తడికి గురైన కోటయ్య.. ఐదు రోజులుగా మనోవేదనతో ఉంటున్నాడు. గుండె సంబంధిత వ్యాధికి గురైనట్టు తెలిసింది. ఖమ్మంలోని ఓ వైద్యశాలకు తరలించగా మూడురోజులపాటు చికిత్స పొందినట్టు సమాచారం. శనివారం డిస్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నప్పటికీ ఇంటి పరిస్థితిపై ఆందోళన చెందాడు. ఆదివారం తీవ్రమైన గుండెపోటు రావడంతో కోటయ్య ప్రాణాలు వదిలాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాణం తీసింది : బీఆర్ఎస్ నేతలు

కోటయ్య మృతికి ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ కార్పొరేటర్, ప్రస్తుత కార్పొరేటర్ భర్త తోట రామారావు ఆరోపించారు. కోటయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన తోట రామారావు దహన సంస్కారాల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వరదలో మునిగిన కోటయ్య ఇల్లును పరిశీలించారు. వరదలు తగ్గి పక్షం రోజులైనా ఒక్క అధికారి గణేశ్‌నగర్‌లో పర్యటించలేదని మండిపడ్డారు. ఆర్థిక సాయం చేశామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు వాస్తవాలు తెలుసుకోవాలంటున్నారు.

ఉపాధ్యాయుడిని హత్యచేసిన మావోయిస్టులు

ఇన్ఫార్మర్ నెపంతో ప్రజా కోర్టులో కర్రలతో కొట్టి దారుణ హత్య

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 15: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు మరో దారుణానికి ఒడిగట్టారు. సుక్మా జిల్లాలో ఇన్ఫార్మర్ నెపంతో ఓ ఉపాధ్యాయుడిని దారుణంగా హతమార్చారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ప్రాథమిక వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జగర్‌గూండకు చెందిన ఉపాధ్యాయుడు దూది అర్జున్‌ను మావోయిస్టులు ఆయన ఇంటి నుంచి అపహరించారు. శనివారం ఆ గ్రామ సమీపంలో ప్రజాకోర్టు నిర్వహించిన మావోయిస్టులు.. అర్జున్‌పై కర్రలతో దాడి చేసి కొట్టి అతి దారుణంగా హత్య చేశారు. అర్జున్ పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో అతడిని దారుణంగా హత్య చేసిన మావోయిస్టులు.. అతడి కుటుంబీకులపై సైతం ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరికలు జారీ చేసినట్టు గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై జగర్‌గుండా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

అన్నంలో పురుగులు వస్తున్నయ్!

గురుకుల పాఠశాల ఎదుట సీపీఐ, విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

గన్నేరువరం, సెప్టెంబర్15: విద్యార్థులకు వడ్డించే అన్నంలో పురుగులు వస్తున్నాయని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ఎదుట సీపీఐ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన చేశారు. 400 మంది బాలికలు ఉన్న ఈ పాఠశాలలో సమస్యలు పట్టించుకోకుండా అధికారులు ఏం చేస్తున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చుక్కల్ల శ్రీశైలం ప్రశ్నించారు. పురుగుల అన్నం తింటే తమ పిల్లల ఆరోగ్యం ఏం కావాలని తల్లిదండ్రులు మండిపడ్డారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఘటనపై ప్రిన్సిపాల్ నవీనను సంప్రదించగా.. రోజూ కూరగాయలు, బియ్యం శుభ్రం చేశాకే వంటచేస్తున్నట్టు తెలిపారు. ఇకముందు పురుగులు రాకుండా చూస్తామన్నారు.

కరీంనగర్ జిల్లా వీణవంకలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దళితబంధు నిధులు విడుదల చేయాలి

ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

వీణవంక, సెప్టెంబర్ 15: దళితుల ఆర్థికాభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి సంబంధించిన రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో వారు మీడియాతో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకం మొదటి విడత నిధులు ఇచ్చి చాలా రోజులైందని, ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు రెండో విడత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. దళితులు ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా, ధర్నాలు, నిరసనలు చేపట్టినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

- తాగునీటి కోసం.. ఖాళీ బిందెలతో నిరసన

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలో తాగునీటి కోసం కాలనీవాసులు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా కాలనీలో తాగునీరు రావడం లేదని పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయమైన గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగారంను వివరణ కోరగా.. బీర్కూర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైపులు ధ్వంసమైనట్టు తెలిపారు. దీంతో వారం రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని, ఆదివారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసినట్టు పేర్కొన్నారు. – నస్రుల్లాబాద్

లాభాలు తేల్చేదెప్పుడు? వాటా ఇచ్చేదెప్పుడు?

- నిరుడు జూలై 6నే టర్నోవర్‌ను ప్రకటించిన సింగరేణి
- రూ.2,222 కోట్ల లాభాల్లో కార్మికులకు 32% వాటా
- దసరాకు 3 రోజుల ముందే రూ.711 కోట్లు జమ
- 2023-24 ముగిసి ఐదున్నర నెలలైనా తేలని లెక్కలు
- సర్కారు, యాజమాన్యం తీరుపై కార్మిక సంఘాల గుస్సా
- జీఎంల ఆఫీసుల ఎదుట 19న టీబీజీకేఎస్ ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రేయింబవళ్లు శ్రమించి నల్ల బంగారాన్ని వెలికితీస్తున్న సింగరేణి కార్మికుల్లో ఈ ఏడాది దసరా ఉత్సాహం కనిపించడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదున్నర నెలలు గడుస్తున్నా ఇంకా టర్నోవర్‌ను ప్రకటించని యాజమాన్యం.. దసరా సమీపిస్తున్నా లాభాల్లో కార్మికుల వాటాను తేల్చడం లేదు. దీంతో పండుగనాటికి లాభాల్లో వాటా వస్తుందో రాదోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసిన రెండుమూడు నెలల్లో యాజమాన్యం టర్నోవర్‌ను ప్రకటిస్తుంది. దసరాకు రెండు, మూడు వారాల ముందు లాభాల్లో కార్మికుల వాటాను ప్రకటించి, పండుగనాటికి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. కానీ, ఈసారి పండుగకు ఇంకో 3 వారాలే ఉన్నా టర్నోవర్ గానీ, లాభాల్లో వాటాగానీ తేల్చలేదు. దీంతో యాజమాన్యం, ప్రభుత్వ వైఖరిపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నిరుడు జూలైలోనే టర్నోవర్ ప్రకటన

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి యాజమాన్యం గత పదేండ్లలో క్రమం తప్పకుండా టర్నోవర్‌ను ప్రకటించి, లాభాల్లో కార్మికులకు వాటా పంచింది. నిరుడు జూలై 6న యాజమాన్యం టర్నోవర్‌ను ప్రకటించింది. రూ.33 వేల కోట్లకుపైగా టర్నోవర్ సాధించామని, రూ.2,222 కోట్ల లాభాన్ని ఆర్జించామని తెలిపింది. ఈ లాభాల్లో 32% వాటాను కార్మికులకు అందజేస్తున్నట్టు కేసీఆర్ ప్రభుత్వం దసరాకు దాదాపు 3 వారాల ముందుగానే అక్టోబర్ 7న ప్రకటించింది. పండుగకు 3 రోజుల ముందు రూ.711 కోట్లను కార్మికుల ఖాతాల్లో జమ చేసింది. సగటున ఒక్కొక్కరి ఖాతాలో రూ.1.70 లక్షలు జమ అయినట్టు కార్మికులు చెప్పున్నారు. కానీ, ఈ ఏడాది సింగరేణి పద్దుల లెక్కతేల్చడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో పండుగకు ఖాతాల్లో డబ్బులు పడతాయో లేదోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు కార్మిక సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు. రూ.37 వేల కోట్ల వ్యాపారం జరిగిందని, దాదాపు రూ.3 వేల కోట్ల లాభాలు వచ్చాయని చెప్తున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తి జరిగినందున ఈ ఏడాది లాభాల్లో కార్మికులకు కనీసం 35% వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పోరుబాటలో టీబీజీకేఎస్

ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఆదాయ వివరాలను ప్రకటించకపోవడంపై టీబీజీకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఆ వివరాలను ప్రకటించాలని ఇప్పటికే అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోకపోవడంతో పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నది. ఈ నెల 19న సింగరేణిలోని అన్ని జీఎంల కార్యాలయల ఎదుట ధర్నాలకు దిగుతామని టీబీజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. ఇది ఆరంభమేనని, ప్రభుత్వం, యాజమాన్యం దిగిరాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులను కంటికి రెప్పలా చూసుకున్నారని, దీనికి భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు గని కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మండిపడ్డారు. పండుగకు రెండుమూడు రోజుల ముందే కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

ముందే ప్రకటించిన కోల్ ఇండియా

దేశంలో 85% బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కోల్ ఇండియా సంస్థ.. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసిన నెల రోజుల్లోనే తమ పద్దుల లెక్కలు తేల్చింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,42,324 కోట్ల వ్యాపారం చేశామని, రూ.37,369 కోట్ల లాభాలు వచ్చాయని మే 2వ తేదీనే వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లోని తొలి త్రైమాసికంలో సాధించిన ఉత్పత్తి, ఆదాయం వివరాలను సైతం జూలై 31నే ప్రకటించింది. మరో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ సైతం రూ.1,78,501 కోట్ల వ్యాపారంతో రూ.5,506 కోట్ల లాభాలు ఆర్జించినట్టు జూలై 27నే ప్రకటించింది. కానీ, సింగరేణి యాజమాన్యం మాత్రం 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదున్నర నెలలు గడిచినా ఇప్పటికీ ప్రకటించలేదు.

పద్మావతికి పదోన్నతి కల్పించే ఫైల్‌ను సమర్పించండి

- ఇంటర్ విద్య కమిషనర్ శ్రీదేవసేన ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతికి పదోన్నతి కల్పించే ఫైల్‌ను వెంటనే సమర్పించాలని ఇంటర్ విద్య కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం సంబంధిత అధికారులను ఆదేశించారు. పద్మావతికి లైబ్రేరియన్‌గా పదోన్నతి కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యవైఖరిని ఎండగడుతూ ఆదివారం 'అమరుడి భార్యకు అష్టకష్టాలు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఇంటర్ విద్య కమిషనర్.. పద్మావతి పదోన్నతికి సంబంధించి ఆదేశాలిచ్చారు.

గురుకుల సిబ్బందికి బదిలీ ఆర్డర్లు

ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్‌కు ఊరట

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని నాలుగో తరగతి సిబ్బందికి ఎట్టకేలకు బదిలీ ఆర్డర్లు వెలువడ్డాయి. 'బదిలీ అయినట్టా? కానట్టా?' శీర్షికన ఇటీవల 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ఈ ఉత్తర్వులను జారీ చేశారు. బోధన సిబ్బంది బదిలీ ప్రక్రియ ముగిసిన 45 రోజుల అనంతరం తాజాగా వీరి బదిలీలకు అవకాశం కల్పించారు. సొసైటీ పరిధిలో నాలుగో తరగతి ఉద్యోగులైన జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్లు మొత్తం కలిపి దాదాపు 400 మందికి పైగా ఉన్నారు. బోధన సిబ్బందితోపాటు బదిలీ కోసం జూలై 31న కౌన్సిలింగ్ నిర్వహించారు. అయితే నెలన్నర రోజులు గడచినా అందుకు సంబంధించిన ఉత్తర్వులను సొసైటీ ఉన్నతాధికారులు వెలువరించలేదు. నమస్తే తెలంగాణ కథనంపై స్పందించిన సొసైటీ ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలను కలెక్టర్లకు పంపించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

- లైంగికదాడి బాధితురాలికి న్యాయం చేయాలి
- గంటకు పైగా గ్రామస్థుల ధర్నా, నిలిచిన రాకపోకలు

ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలి బంధువులు, పెరుకపల్లి గ్రామస్థులు

వెంకటాపూర్, సెప్టెంబర్ 15: లైంగికదాడి బాధితురాలికి న్యాయం చేయాలని బాధితురాలి బంధువులు, గ్రామస్థులు ఆదివారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం పెరుకపల్లికి చెందిన 60 ఏండ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన మాదం శివకుమార్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మూడు రోజులు దాటినా పోలీసులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులు పట్టించుకోవడం లేదని జిల్లా ఎస్పీ శబరీశ్‌ను కలిసేందుకు వెళ్తున్న 200 మంది గ్రామస్థులను పోలీసులు తాళ్ల పాడు వద్ద అడ్డగించారు. ఆగ్రహించిన గ్రామస్థులు వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నిందితుడు గ్రామంలో తిరుగుతూ సాక్ష్యం చెప్తే చంపుతానని బెదిరిస్తున్నాడని, అయినా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆందోళన చేశారు. ఎస్సై జక్కుల సతీశ్ గ్రామస్థులతో మాట్లాడినప్పటికీ ఫలితం లేదు. దీంతో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. నిందితుడిని 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని తెలిపారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, నూతన పీఆర్సీని అమలుచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరింది. ఆదివారం హైదరాబాద్ దోమల్‌గూడలోని కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, రవి పాల్గొని.. మాడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దుకింద వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్ టీచర్లు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని టీచర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తీర్మానాలు చేశారు.